
# సాక్షి
## అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 17 । మే । 2024





**సుజలాం.. సుఫలాం!**
మట్లిరాజులు, చోళరాజులు పాలించిన చరిత్ర నుంచి నేటి వరకు నందలూరు నీటికి ఉన్న పేరు మరెక్కడాలేదనేది నిత్యసత్యం.
-8లో



**హార్సిలీహిల్స్ సొసైటీ ప్రక్షాళన!**
హార్సిలీ హిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు లోకాయుక్త ఆదేశంతో చర్యలు సిద్ధమయ్యాయి.
-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.134 | రూ.180 |
| రెండోరకం | రూ.90 | రూ.130 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 544 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### టీబీ టీకా కేంద్రాల తనిఖీ



టీకా వేయడాన్ని పర్యవేక్షిస్తున్న రియాజ్‌బేగ్, విష్ణువర్ధన్‌రెడ్డి

రాయచోటి అర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న వయోజన టీబీ టీకాల కేంద్రాలను గురువారం అన్నమయ్యజిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్య వేక్షణాధికారి (డీపీఎంఓ ) డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎస్‌ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. రాయచోటి పట్టణ పరిధిలోని కొత్తపల్లె అర్బన్ ఆరోగ్యకేంద్రం, లక్కిరెడ్డిపల్లె మండలం దేవళంపల్లె పీహెచ్‌సి పరిధిలోని కుర్నూతల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో నిర్వహిస్తున్న వయోజన టీకా కేంద్రాలను డీపీఎంఓ పరిశీలించారు. చెక్‌లిస్ట్ ప్రకారం, టీకా కేంద్రంలో ప్రోటోకాల్ ప్రకారం ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా.. అని తనిఖీ చేశారు.వ్యాక్సిన్ వల్ల ఏ జబ్బును నివారించవచ్చు.. ఫాలోఅప్ ఎప్పుడెప్పుడు చేసుకోవాలి, ఒక వేళ వ్యాక్సిన్ వల్ల ప్రతికూల పరిస్థితి ఏర్పడితే ఎవరిని ఎప్పుడు సంప్రదించాలి అనే అంశాలపై టీకా వేసుకునే వారికి తప్పక అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గురువారం బీసీజీ టీకా దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్, దేవళంపల్లె పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాయితీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ

రాయచోటి: జిల్లాలోని రైతులకు సబ్సిడీ వేరుశనగ కాయలు, పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ గురువారం రాయచోటిలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు 40శాతం సబ్సిడీపై వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.జనుము 2578 క్వింటాళ్లు, జీలుగ 2492 క్వింటాళ్లు, పిల్లిపెసర 76 క్వింటాళ్లు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. వేరుశనగ కె–6 రకం 35323 క్వింటాళ్లు, నారాయణి రకం 18046 క్వింటాళ్లు, టీసీఎస్ 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 1114 క్వింటాళ్లు జిల్లాకు వచ్చాయన్నారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి కావాల్సిన విత్తనాలు ఎంపిక చేసుకుని తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి వారి పేర్లు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ నిలిపివేత

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: డ్రైవింగ్ లైసెన్స్ సేవలను ఈనెల 18 వరకు నిలిపివేస్తున్నట్లు వైఎస్‌ఆర్ జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగర శివారులోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రవాణాశాఖ పోర్టల్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాలు, డేటా బేస్‌లో తలెత్తిన సమస్యలతో డ్రైవింగ్ లైసెన్సుల జారీని నిలిపి వేస్తున్నామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ సేవలు 18వ తేది ఉదయం 10 గంటల నుంచి తిరిగి అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గుర్తించుకోవాలని సూచించారు.

### 21 నుంచి కడప రాయుడి తెప్పోత్సవం



తెప్పపై కడప రాయుడు (ఫైల్)

కడప కల్చరల్: కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవం ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో ఏటా మే నెలలో ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8.00 గంటల వరకు ఆలయం వద్దగల శ్రీవారి పుష్కరిణిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 21న తెప్పపై శ్రీకృష్ణుడు, గోదాదేవీలను కొలువుదీర్చి మూడు ప్రదక్షిణలు చేయిస్తామన్నారు. 22న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిలకు ఐదు ప్రదక్షిణలు చేయిస్తామని, చివరిరోజు 23న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి పుష్కరిణిలో తెప్పపై ఏడు ప్రదక్షిణలు చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

# కోట.. విశేషాల కలబోత

ఈ విశాల విశ్వంలో ప్రకృతి రమణీయతకు..అపురూపమైన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలకు నెలవుగా ఎన్నెన్నో ప్రాంతాలు..గజి‘బిజీ’ జీవితంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా వేసవి సెలవులను గడువుదామని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. టూరుకు వెళితే బాగుంటుందని భావిస్తుంటారు. దూర ప్రాంతాల్లో కాకుండా దగ్గర్లో ఉంటే అనువుగా ఉంటుందని కోరుకుంటారు. అలాంటి వారిని అన్నమయ్య జిల్లాలో కొలువు దీరిన గుర్రంకొండ కోట రారమ్మని పిలుస్తోంది. చూసొద్దాం రండి..

- అన్నమయ్య జిల్లాకు మణిహారం
- నిత్యం పర్యాటకులతో సందడిగా గుర్రంకొండకోట
- సెలవుల వేళ..చూసొద్దాం రండి.




రంగిణీమహల్ ముందువైపు నుంచి రెండు అంతస్థులుగా కనిపిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లాలో రాచరికానికి, నవాబులు, రాజులు, బ్రిటీషువారి పాలనకు నిలువుటద్దం గుర్రంకొండ కోట. జిల్లాకు నడిబొడ్డున ఒక మణిహారంలా.. చారిత్రాత్మక పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. 14 వ శాతాబ్దం నుంచి ఈకోటను పలు వంశాలకు చెందిన రాజులు, నవాబులు పరిపాలించారు. ముఖ్యంగా కడప నవాబు పరిపాలనలో ఈ కోట పేరుగాంచింది. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి దేవాలయాలు, ఎన్నో చెరువులు ఉన్నాయి. మైసూర్ రాజు టిప్పుసూల్తాన్ బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే గడిచింది. చివరగా బ్రిటీషువారితో ఇక్కడ రాజరిక పాలనకు తెరపడింది. ఇలాంటి ఘనచరిత్ర కలిగిన ఈ కోటలో ఎన్నో విశేషాలు, చూడదగిన ప్రదేశాలు, ఆకట్టుకొనే కట్టడాలు ఇక్కడి ప్రత్యేకం. వేసవి సెలవుల్లో ఇక్కడి విశేషాలను తిలకించడానికి మన రాష్ట్రం నుంచేకాక కర్ణాటకా నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు.

**రంగిణీమహల్:**
గుర్రంకొంట కోటలో చూడదగిన ముఖ్య ప్రదేశం రంగిణీమహల్. పురాతన రాజభవనం. ముందువైపు నుంచి రెండు అంతస్తులుగా, వెనకవైపు నుంచి మూడు అంతస్తులుగాను కనిపించడం దీని ప్రత్యేకత. ఎన్నో గదులు, ఓ గదిలో భవనం లోపలి నుంచి సొరంగ మార్గం ఉంది. శత్రురాజులు దండెత్తినప్పుడు ఈమార్గం గుండా కోటబయటకు వెళ్లేందుకు దీనిని ఉపయోగించేవారు.పురాతన మెట్లు, సమావేశపు గదులు రాజరికానికి నిలుటద్దంగా నిలుస్తాయి.

**శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం:**
గుర్రంకొండ కోటను విజయనగర రాజులు పాలించే కాలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అప్పటి పాలకులు శ్రీకృష్ణ దేవరాయులు కోటలోని కొండపై భాగంలో నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. రంగిణీ మహల్‌కు దగ్గరలో కొండపైకి చేరుకొనే మార్గంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్తంభాలు శిల్పకళాసౌందర్యంతో ఆకట్టుకుంటాయి. అన్ని దేవాలయాలను తూర్పుముఖంగా నిర్మిస్తే ఈ ఆలయాన్ని పశ్చిమముఖంగా నిర్మించడం విశేషం. ఇక్కడి నుంచి చూస్తే గుర్రంకొండ పట్టణంతోపాటు పరిసర గ్రామాల పచ్చటి పొలాలు, రాయల కాలం నాటి చెరువులు కనిపిస్తాయి.

**కోటముఖద్వారం:** గుర్రంకొండను రాజులు పరిపాలించే కాలంలో కొండ చుట్టూ కోటగోడలను నిర్మించారు. వీటి చుట్టూ కందకాలు తవ్వారు.కందకాలను నీటితో నింపేవారు. శత్రువులు కోటగోడలు ఎక్కకుండా నీటిలో మొసళ్లను వదిలేవారు. అలాంటి కోటకు ముఖద్వారాన్ని నిర్మించారు. ఈ ద్వారం నుంచే ఎవరైనా కోటలోకి ప్రవేశించేవారు. పురాతన కట్టడంగా ఇది నిలుస్తోంది.





గుర్రంకొండ కోట ముఖద్వారం, శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించిన శ్రీ నరసింహస్వామి దేవాలయం

**మగ్బీరా:** కోటపక్కనే మగ్బీరా ఉంది. పురాతన మహమ్మదీయుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కట్టడం ఇది. మగ్బీరా అంటే సమాధి. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ మేనమామ మీర్‌రజాఆలీఖాన్ పాలించే వారు. అతను మృతిచెందిన తరువాత సమాధిని మగ్బీరాగా నిర్మించారు. ఇక్కడి డూమ్‌లో చేసే శబ్దాలు ప్రతి ధ్వనించడం (రీసౌండ్) ఇక్కడి ప్రత్యేకత.

**షాహజాదీమసీదు:**
టిప్పు సుల్తాన్ కాలంలో రాజవంశీయుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మసీదు ఇది. పూర్తిగా రాతితోనే నిర్మించడం దీని ప్రత్యేకత. ఎక్కడా ఇతర నిర్మాణ వస్తువులు( ఇసుక,సిమెంటు, కంకర) లాంటివి వినియోగించకుండా పూర్తిస్థాయిలో రాతితోనే నిర్మించా రు. ప్రస్తుతం దీనిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. ఇలాంటివి కోట పరిసరాల్లో మరో రెండు ఉన్నాయి.

**షాకమాల్ దర్గా:**
మైసూర్ పాలకులు, అప్పటి గుర్రంకొండ కోట పాలకులు అయిన టిప్పు సుల్తాన్ ఆస్థాన గురువు షాకమాల్ దువ్వమ్. ఆయన ఈజిప్టు దేశం నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన గొప్పతనం విన్న అప్పటి మైసూర్ పాలకులు హైదరాలీ తన కుమారుడు టిప్పుసుల్తాన్‌ను గుర్రంకొండలోని అతని మేనమామ మీర్‌రజా ఆలీఖాన్ వద్ద ఉంచి షాకమాల్ దగ్గర విద్యాబుద్ధులు నేర్పించారు. తదనంతర కాలంలో షాకమాల్ దువ్వమ్ టిప్పుసుల్తాన్ గురువుగా నియమితులయ్యారు. ఇతని సమాధినే ఇక్కడ గొప్ప దర్గాగా ప్రజలు కొలుస్తారు. ఇది గుర్రంకొండ పట్టణంలో ఉంది.

**యూసూఫ్ సాహెబ్ తకియా:**
టిప్పుసుల్తాన్ చదువుకున్న పాఠశాలే యూసూఫ్ సాహెబ్ తకియా, ( తకియా అంటే పారసీ భాషలో పాఠశాల అని అర్థం). అందరితోపాటు టిప్పుసుల్తాన్ తన గురువు షాకమాల్ దగ్గర ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్నాడు. గుర్రంకొండ పట్టణంలోని షాకమాల్ దర్గా పక్కనే ఈ పురాతన పాఠశాల భవనం ఉంది. అలనాటి చరిత్రకు నిలుటద్దంలా ఈపురాతన కట్టడం నిలిచింది.

**ఇంకా చూడదగినవి..**



మీర్ రజాఅలీఖాన్ సమాధి మగ్బీరా

- కొండపైన కోట బురుజులు, పురాతన కట్టడాలు, పురాతన ఇళ్లు ఉన్నాయి. అక్కడికి చేరుకోవడానికి మెట్లమార్గం కూడా ఉంది.
- కోటలో శిథిలావస్థకు చేరుకొన్న అలనాటి ఆస్పత్రి భవనం ఉంది.
- కోటలో శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, టిప్పుసుల్తాన్ కాలం నాటి ఈద్గాలు ఉన్నాయి.
- గుర్రంకొండ పట్టణంలో శ్రీ షాకమాల్ దర్గా దర్గా దగ్గర టిప్పుసుల్తాన్ చదువుకొన్న పాఠశాల యూసూఫ్ సాహెబ్ తకియా ఉంది.
- కోట నుంచి పదికిలోమీటర్ల దూరంలో తరిగొండ గ్రామంలో ప్రముఖ రచయిత్రి తరిగొండ వెంగమాంబ ఆలయముంది.
- కోట నుంచి 8 కిలోమీటర్లదూరంలో సంతాన ప్రదాయిని చెర్లోపల్లె శ్రీ రెడ్డెమ్మకొండ దేవాలయం ఉంది.

**ఇలా వెళ్లొచ్చు**

జిల్లాకేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో 38 కిలోమీటర్ల దూరంలో కడప–బెంగుళూరు జాతీయరహదారిపై ఉంది. తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో వాల్మీకీపురంలో దిగాలి. అక్కడి నుంచి గుర్రంకొండ 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇదే మార్గంలోనే తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది. తిరుపతి నుంచి నేరుగా అయితే 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది. చిత్తూరు నుంచి 125 కిలోమీటర్లదూరం ఉంటుంది. మదనపల్లె నుంచి కడపకు వెళ్లే మార్గంలో అయితే మదనపల్లె నుంచి 33 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

## డెంగీని అరికడదాం



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

కడప రూరల్: ఐక్యంగా డెంగీ నిర్మూలనకు కృషి చేయాలని వైఎస్‌ఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ భవనంలో డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ ఏడాది నేషనల్ డెంగీ డే సందర్భంగా సమాజ భాగస్వామ్యంతో డెంగీని అరికట్టవచ్చనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ, రిమ్స్ మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగసుధ, ఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంఓ మనోరమ, ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, యూనిట్ ఆఫీసర్ పాల్గొన్నారు.

# దేవా.. దీవించవా..

**ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు**

బ్రహ్మంగారిమఠం: ‘దేవా.. దీవించవా’.. ‘మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని కాపాడవయ్యా..’ అంటూ భక్తులు వేడుకున్నారు. వైఎస్‌ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజైన గురువారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలతో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు.



నరనంది వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

**వైభవంగా నరనంది ఉత్సవం**
రాత్రి నరనంది ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నరనంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి వీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతి వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబ దత్తాత్రేయ స్వామి, వరదరాజస్వామి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఈఏపీసెట్



పరీక్షకు హాజరైన విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీలో ప్రవేశాలకు కోసం గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు బైపీసీ విద్యార్థులకు నిర్వహించారు. విద్యార్థులంతా గంటనర్రా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులను పరీక్ష కేంద్రం సిబ్బంది విద్యార్థుల హాల్‌టికెట్, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటిల్లో నిర్వహించిన 9 పరీక్షా కేంద్రాలకుగాను ఉదయం, సాయంత్ర రెండు సెషన్స్‌కు సంబంధించి 2474 మంది విద్యార్థులకుగాను 2200 మంది హాజరుకాగా 274 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

| పరీక్షా కేంద్రం | కేటాయించిన విద్యార్థులు | హాజరు |
|---|---|---|
| కేఎస్‌ఆర్‌ఎం | 209 | 200 |
| శ్రీనివాస | 400 | 364 |
| అన్నమాచార్య | 220 | 203 |
| కేఓఆర్‌ఎం | 296 | 259 |
| కేఎల్‌ఎం | 200 | 184 |
| ఎస్‌ఆర్‌ఐటీ(పొద్దుటూరు) | 346 | 300 |
| సీబీఐటీ (చాపాడు) | 298 | 227 |
| అన్నమాచార్య(రాజంపేట) | 295 | 268 |
| భాస్కర్ ఇంజినీరింగ్ కాలేజీ (రాయచోటి) | 210 | 195 |

# ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

- విద్యాహక్కు చట్టంలో భాగంగా అమలు
- జిల్లా వ్యాప్తంగా 600 మంది పేద విద్యార్థులకు లబ్ధి



మదనపల్లె కార్పోరేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో ఉచితంగా అడ్మిట్ చేసిన సమగ్రశిక్ష అధికారి కరుణాకర్, విద్యాశాఖ అధికారులు

మదనపల్లె సిటీ: జిల్లాలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థుల ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ఈ మేరకు మొదటి విడత చిన్నారుల జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1) (సి) ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలి. 2024–25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిని అనుసరించి 1132 మంది దరఖాస్తు చేసుకోగా 600 మంది తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించిన మొదటి విడత జాబితాను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు.

**మొదటి విడతతలో..**
జిల్లా వ్యాప్తంగా 600 మంది చిన్నారులకు ఒకటవ తరగతిలో ప్రవేశానికి అవకాశం కల్పించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తూ తొలి జాబితాను సమగ్రశిక్ష అధికారులు విడుదల చేశారు. మొదటి విడత జాబితా విడుదలతో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించారు.

**'జిల్లా వ్యాప్తంగా...**
జిల్లాలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు విద్యాహక్కు చట్టం ప్రకారం సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయి. పాఠశాల విద్యాశాఖ జిల్లాల వారీగా వీటి జాబితాను ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు గతంలోనే పంపించి, సీఎస్‌ఈ వెబ్‌పోర్టర్‌లో నమోదయ్యేలా చర్యలు చేపట్టింది. ఐబీ, ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. రిజిస్ట్రేషన్ అనంతరం ఆయా పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 శాతం సీట్లను ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాలి. ప్రస్తుతం విడుదల చేసిన మొదటి విడత అడ్మిషన్లలో భాగంగా 600 విద్యార్థులకు సీట్లు కేటాయించారు. వీరందరూ ఈనెల 20వతేదీ లోపు ఆయా పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్లు తీసుకోవాలి. ఈ విషయాన్ని ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు విద్యాశాఖ అధికారులు సమాచారం పంపించారు.

**జాబితా విడుదల**



విద్యాహక్కు చట్టం ప్రకారం మొదటి విడత జాబితాను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. గత విద్యా సంవత్సరంలో కూడా ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాం. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఈ చట్టంపై అవగాహన ఉంది. –శివప్రకాష్‌రెడ్డి, డీఈవో

| మండలం | కేటాయించిన సీట్లు |
|---|---|
| మదనపల్లె | 125 |
| రాయచోటి | 100 |
| పీలేరు | 58 |
| రాజంపేట | 48 |
| బి.కొత్తకోట | 39 |
| ఓబులవారిపల్లె | 23 |
| గాలివీడు | 22 |
| ములకలచెరువు | 24 |
| కోడూరు | 31 |
| పెనగలూరు | 17 |
| టి.సుండుపల్లి | 16 |
| చిట్వేలి | 23 |
| గుర్రంకొండ | 11 |
| నందలూరు | 11 |
| పుల్లంపేట | 9 |
| కె.వి.పల్లి | 8 |
| కురబలకోట | 9 |
| లక్కిరెడ్డిపల్లె | 5 |
| తంబళ్లపల్లె | 3 |
| వాల్మీకిపురం | 4 |
| పి.టి.సముద్రం | 2 |
| రామాపురం | 2 |
| కలకడ | 1 |
| నిమ్మనపల్లె | 2 |
| రామసముద్రం | 1 |
| కలికిరి | 6 |

## క్లుప్తంగా

### 22 నుంచి ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్

నందలూరు(రాజంపేట) : ఈనెల 22వ తేదీ నుంచి నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లి ప్లే గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ముమ్మడిశెట్టి సుధాకర్, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, శివకోటి తెలిపారు. ఆసక్తిగల టీమ్‌లు రూ. 1500 ఎంట్రీ ఫీజు చెల్లించి మే 20వ తేదీ లోపు జట్టు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ. 40 వేలు ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000527227, 9676334033, 8309199305, 9866015602 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

### బాలుడి అదృశ్యం


వర్ధన్ (ఫైల్)

బి.కొత్తకోట : స్థానిక మంజూరమ్మ గుడి వీధికి చెందిన ఖుషి వర్ధన్ (12) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ సూర్యనారాయణ గురువారం తెలిపారు. మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో వర్ధన్ అదృశ్యమైనట్టు తెలిపారు. ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ములకలచెరువు : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు... బి.కొత్తకోట మండలం సుంకరోళ్లపల్లెకు చెందిన రామస్వామి(50) తన ద్విచక్రవాహనంలో ఈశ్వరమ్మ(45), నారాయణమ్మ(48)లతో కలిసి గండువారిపల్లెకు బయలుదేరాడు. బురకాయలకోట మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. అనపగుట్ట గుడివీధికి చెందిన వెంకటరమణ కుమారుడు టి.నరేష్ కుటుంబ సమస్యలతో ఇంటి సభ్యులతో గొడవపడ్డాడు. మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సుజలాం.. సుఫలాం!

- చెయ్యేటి నీళ్లతో నందలూరుకు చరిత్రలో ప్రత్యేక స్థానం
- ఈ ప్రాంతంలోని నీటిపైనే అందరి దృష్టి
- నందలూరు నీళ్ల నాణ్యతపై మినరల్ వాటర్ కంపెనీల విస్మయం

**నీటి కోసం యుద్ధాలు జరిగాయనేది చరిత్ర చెబుతున్న సత్యం.. అదే నీటిధారలతోనే ప్రాంతాలు అభివృద్ధి చెందిన దాఖలాలు ఉన్నాయి. కేవలం నీటి వనరులను బట్టి రాజులు రాజ్యాలు పాలించిన చరిత్రలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నీటితో ఒక ప్రాంతం అభివృద్ధి చెందింది..దానితోనే గుర్తింపు వచ్చిందింటే.. అందుకు నిదర్శనం నందలూరు.. సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం..**



రాజంపేట : మట్లిరాజులు, చోళరాజులు నందలూరు మండలం చెయ్యేరు నదీపరీవాహక ప్రాంతమైన పొత్తపిని రాజధానిగా చేసుకొని పాలించిన చరిత్ర నుంచి నేటి వరకు నందలూరు నీటికి ఉన్న పేరు మరెక్కడాలేదనేది నిత్యసత్యం. కేవలం నందలూరు నీళ్లతోనే తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకుంది. ఒక్కసారి నందలూరులో నివాసం చేసుకుంటే ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టక పోవడానికి ప్రధాన కారణం. నందలూరు నీటిలో పొటాషియం, కాల్షియంతోపాటు ఖనిజ లవణాలు పుష్కలంగా ఉన్నాయి. టీడీఎస్ 188 పాయింట్లు చూపిస్తోంది. అదే కంపెనీ వాటర్‌బాటిల్‌లో 25 నుంచి 35 పాయింట్లు చూపిస్తోంది.


నందలూరు చెయ్యేరు నది

#### ఏళ్ల తరబడి భూగర్భ జలాలు

నందలూరు మండలం పాటూరు నుంచి పొత్తపి వరకు చెయ్యేరు నది వెంబడి ఉంటుంది. ఏడాదిలో ఒక సారి నీటి ప్రవాహం కొనసాగితే యేళ్ల తరబడి భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. అన్నమయ్య డ్యాం తెగిన క్రమంలో యేడాదిపాటు నీటి ప్రవాహం కొనసాగింది. అలాగే ఈ మధ్యలో అడపాదడపా వర్షాలతో నీటి ప్రవాహం కొనసాగింది. ఇదే విధంగా కొన్ని శతాబ్దాల నుంచి చెయ్యేటి నీళ్లు ఈ ప్రాంతానికి వరంగా మారుతూ వచ్చాయి. నందలూరు మేధావులకు నిలయంగా మారడానికి కూడా ఈ నీళ్లే అనే అభిప్రాయం ఉంది.

#### చెయ్యేటి వారన ఊట కాలువలు..

చెయ్యేటి వారంబడి ఎక్కడాలేని విధంగా ఊటకాల్వలు(స్ప్రింగ్‌చానల్స్)లో సాగు చేసే విధానం చోళ, మట్లిరాజుల కాలం నుంచి ఉంది. ఇప్పటికీ ఈ ఊటకాల్వలు మండలంలో విస్తారంగా ఉన్నాయి.

#### నీటితోనే రైల్వేపుట్టుక

నందలూరు నీటితోనే రైల్వేపుట్టుక ఆరంభమైంది. 1864లో బ్రిటీషర్లు నందలూరులో నీటి లభ్యతను ఆధారం చేసుకొని స్టీమ్ ఇంజన్ లోకోషెడ్ నిర్మితం చేశారు. ఈ నీటి ఆవిరి వల్ల పింగాణి తుప్పు పట్టకుండా ఉంటుందని అప్పట్లోనే బ్రిటీషు రైల్వే పాలకులు నీటి నాణ్యతపై పరిశోధనలు చేశారు. రైల్వే అధికారులు నీటి కోసం యేటి ఒడ్డున బావిని తవ్వించారు. పైపైకి నీటి ధారలు ఎగిసిపడటంతో సీసం పోసి రైల్వే అధికారులు నియంత్రించిన సంఘటన అప్పట్లో సంచలనం కలిగించింది.

#### నీటి వనరులతోనే ఆల్విన్ ఆవిర్భావం..

నీటి వనరులు పుష్కలంగా ఉన్న తరుణంలో 1982లో నందలూరు కేంద్రంగా చేసుకొని ఆల్విన్ రిఫ్రిజిరేటర్ల కర్మాగారాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో రాయలసీమకే తలమానికంగా నిలిచింది. వేలాది మంది కార్మికులు ఇతర జిల్లాలతోపాటు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు ఆల్విన్‌లో పనిచేశారు. వారిలో చాలామంది నందలూరులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు కారణం నీరే.

#### కడపకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

స్టీమ్ ఇంజన్ లోకోషెడ్ కొనసాగిన హయాంలో కడపకు నందలూరు నుంచి ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా అయ్యేవి. 1977లో దక్షిణమధ్యరైల్వే సదరన్ రైల్వే నుంచి విడిపోయినప్పటికి ఈ ప్రాంతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారంటే నీళ్లే కారణంగా చెపుతున్నారు.

#### జోరుగా నీటి వ్యాపారాలు..

నందలూరులో నీటి వ్యాపారాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతున్నాయి. వాటర్‌ప్లాంట్స్ ఏర్పాటు చేసుకున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో ఈ వ్యాపారం సాగుతోంది. ఇప్పటికే ప్యూరిఫైడ్ వాటర్ ప్రక్కతిపరంగా లభ్యమవుతున్న క్రమంలో ఇక్కడి ప్రాంతీయులు యేటినీటికే ప్రాధాన్యత ఇస్తారు. అలాగే నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో కేవలం చెన్నైకు వెళ్లే కరివేపాకును తడిపే నీటి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ విధంగా నీటి అమ్మకాలు జరుగుతున్నాయి.

#### నందలూరు నీళ్లు అనగానే తాగాలనిపిస్తుంది



నందలూరు నీళ్లు అంటేనే ఓ క్రేజ్ ఉంది. ఈ నీళ్లకు ఉన్న ప్రాధాన్యత ఏ ప్రాంతానికి చెందిన నీటికి లేదు. బ్రిటీషు రైల్వే పాలకులు నందలూరు నీటి నాణ్యతను గుర్తించారు. అందుకే నందలూరు స్థావరంగా చేసుకుని రైలు మార్గాన్ని విస్తృత పరిచారు. సీమకే తలమానికంగా నిలిచిన ఆల్విన్ ఫ్యాక్టరీ నీటి వనరుల వల్లే ఆవిర్భవించింది. నందలూరు నీళ్లు అంటే ఎవరైనా తాగాలనుకుంటారు. ఆరోగ్యకరమైన ప్రకృతి ప్యూరిఫైడ్‌వాటర్.

– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, నందలూరు

#### చెయ్యేరు నీళ్లలోనే మేధావితనం ఉంది



నందలూరు నీళ్లలోనే మేధావితనం ఉంది. ఇందుకు నిదర్శనం నందలూరు చెయ్యేరు నీటి దాహార్తి తీర్చుకొన్న వారిలో ఈ ప్రాంతానికి చెందిన వారు ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలుగా ప్రసిద్ధి చెందారు. కేవలం నందలూరు నీటి వనరులతో గుర్తింపు వచ్చింది. విక్రయాలు సాగిస్తున్న మినరల్ వాటర్ బాటిళ్ల కన్నా నందలూరు యేటి నీళ్లే నాణ్యత కలిగి ఉన్నాయి. నందలూరు వాసులకు ప్రకృతి ప్రసాదం నీరే. నందలూరు అంటే గుర్తొచ్చేది నీళ్లే.

– అరిగెమణి, వైఎస్సార్‌సీపీ కాపునేత, నందలూరు

#### నందలూరు నీళ్లతో రైలింజన్లు నడిచేవి



బ్రిటీషు కాలం నుంచి అరక్కోణం–నందలూరు మధ్య స్టీమ్ లోకో రైలింజన్లతో రైళ్లు నడిచేవి. నీటి నాణ్యత కారణంగా తెల్లదొరల కాలంలో నందలూరులో లోకోషెడ్ నిర్మితం చేశారు. నందలూరు నీళ్లు అంటే రైల్వేలో ప్రత్యేక గుర్తింపు. విధి నిర్వహణ నిమిత్తం వచ్చిన అనేక మంది కార్మికులు ఇక్కడే స్థిరపడ్డారంటే అందుకు నీరే కారణం. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి నీటి నాణ్యత, లభ్యతను గుర్తించి, నందలూరును అభివృద్ధి చేసే దిశగా యోచించాలి

– నాయనపల్లి విజయ్‌కుమార్, రిటైర్డ్ రైలింజన్ డ్రైవర్, నందలూరు

#### ఇక్కడి నీళ్లలో ఖనిజ లవణాలు పుష్కలం



నందలూరు నీళ్లలో ఖనిజ లవణాలు పుష్కలంగా ఉన్నాయి. నందలూరు నీటి గురించి తెలిసిన వారు ఎవ్వరూ మినరల్ వాటర్ బాటిళ్లు, క్యాన్‌లు తీసుకోరు. ఆ నీటికే ప్రాధాన్యత ఇస్తారు. ప్రకృతి ప్యూరిఫైడ్ వాటర్‌గా గుర్తింపు ఉంది. నందలూరుకు వచ్చేవారు యేటి ద్వారా వచ్చే నీటిని తీసుకుంటున్నారు. అంటే నందలూరు నీళ్లకు ఉన్న ప్రాధాన్యత ఏ పాటిదో తెలుస్తోంది.

– పిల్లి వేణుగోపాల్, పీఈటీ, ఆల్విన్‌స్కూల్, నందలూరు

## మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇంటిపై దాడి హేయమైన చర్య


ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్, బీసీ నాయకుడు వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై టీడీపీ అల్లరి మూకలు దాడి చేయడం హేయమైన చర్యగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్నికల తరువాత కొంతమంది ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడడం మంచి పరిణామం కాదన్నారు. ఈ మేరకు గురువారం శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాయచోటి ప్రాంతంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడకొట్టే విధంగా పాత రోజులకు తీసుకెళ్లేలా కొన్ని అల్లరి గ్యాంగులు తయారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో మైనార్టీలకు చెందిన మొనార్క్ ఫర్నిచర్ షాప్‌ను ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే తమలో కూడా ఓర్పు, సహనం సన్నగిల్లి గట్టిగా సమాధానం చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇంటిపై దాడి కేసులో నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

రాయచోటి టౌన్ : రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో రాయచోటి – గాలివీడు రోడ్డులో ఉన్న వండాడి వెంకటేశ్వర్లు బంగ్లాలోకి రాయచోటి ప్రాంతానికి చెందిన పదిలం ప్రసాద్, మండ్ల సతీష్, శివ శంకర్, పదిలం నికేష్, పాలగిరి మౌలా, యాదగిరి బాలాజీలు ఇంటి ప్రహరీకి ఉన్న సోలార్ వైర్లు కట్ చేసి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంటి లోపల పార్కింగ్ చేసిన జీపు అద్దాలు పగులకొట్టారు. అలాగే ఫర్నీచర్, కుర్చీలు, లైట్లు, అద్దాలు ధ్వంసం చేశారు. ఈనెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ తరపున జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకొందని తెలిపారు. దీన్ని మనసులో ఉంచుకుని పోలింగ్ ముగిసిన తరువాత 15వ తేదీ రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈ దాడికి పాల్పడినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు వివరించారు. 24 గంటల వ్యవధిలో నిందితులను అరెస్టు చేసినందుకు అర్బన్ ఎస్ఐ భక్తవత్సలంను అభినందించారు.



## హార్సిలీహిల్స్ సొసైటీ ప్రక్షాళన!

- ఒకేసారి 400 మందికి సభ్యత్వం
- ఒకే కుటుంబంలో ఐదారుగురికి కూడా
- 800 పై చిలుకు చేరిన సభ్యుల సంఖ్య
- వారిని తొలగించాలని లోకాయుక్త ఆదేశం
- అధ్యక్షుడికి డీఎల్‌సీఓ నోటీసు


హార్సిలీ హిల్స్

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ పేరుతో ప్రారంభించిన హార్సిలీ హిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు లోకాయుక్త ఆదేశంతో చర్యలు సిద్ధమయ్యాయి. గతంలో ఇష్టానుసారంగా సభ్యులను చేర్చుకోవడం, అందులోనూ ఒకే కుటుంబానికి చెందిన ఐదారుగురిని సభ్యులుగా చేర్చుకోవడంపై ఎప్పటి నుంచో వివాదం నెలకొంది. ప్రధానంగా గతంలో కేవలం ఐదారు నెలల వ్యవధిలో 400 మందికి సభ్యత్వం ఇవ్వడం తీవ్ర అనుమానాలకు తావిచ్చింది. ఈ సంఘ వ్యవహారంపై గత ఏడాది లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు సహకార శాఖ అధికారులు ఇప్పుడు చర్యలు చేపట్టారు. దీనిపై సంఘ పాలకవర్గం ఎలా స్పందిస్తుంది, ఏ మేరకు చర్యలు తీసుకుంటుంది అన్నది ముమ్ముందు గమనించాల్సి ఉంది. దీనికి సంబంధించిన సమగ్ర వివరాల్లోకి వెళితే...

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్ ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ కేంద్రం పేరుతో 70 ఏళ్ల క్రితం చిత్తూరు, మదనపల్లి, తంబళ్లపల్లికి చెందిన ప్రముఖ కుటుంబాలకు చెందిన వ్యక్తులు హార్సిలీహిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని ప్రారంభించారు. ఈ సొసైటీకి ఆస్తులు, వనరులు అప్పట్లో లేవు. 1974 నవంబర్ 30న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సొసైటీకి మార్కెట్ విలువ కింద 20.60 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమి కేటాయింపు తర్వాత సొసైటీలో పరిస్థితులు మారిపోయాయి. ఒక కుటుంబానికి చెందిన ఒకరికే సభ్యత్వం ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ దాన్ని అటకెక్కించారు. ఒకే కుటుంబంలో ఐదారుగురిని సభ్యులుగా చేర్చుకున్నారు. పదేళ్ల క్రితం కేవలం ఐదారు నెలల వ్యవధిలో 400 మందికి సొసైటీలో సభ్యత్వం కల్పించారు. దీని ఫలితంగా ఇప్పుడు సభ్యుల సంఖ్య 800 పైచిలుకు చేరింది. ఇంత భారీ స్థాయిలో ఏ సొసైటీలోనూ సభ్యత్వం ఉండదని సహకార శాఖ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. సొసైటీ విషయంలో చర్యలు తీసుకునేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయని చెబుతున్న సహకార శాఖ అధికారులకు లోకాయుక్త ఆదేశాలు ఊరటనిచ్చాయి. ఈమేరకు మదనపల్లె సహకార శాఖ డివిజనల్ అధికారి శ్యాం ప్రకాష్ రెడ్డి సొసైటీ ఛైర్మన్ కు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఒక కుటుంబంలో ఒకరికే సభ్యత్వం ఉండాలని, భార్యాభర్తలకు సభ్యత్వం ఉండరాదని, పలు నిబంధనలు అమలు చేయాలని కోరుతూ నోటీసు ఇచ్చారు.

#### తొలగింపు సాధ్యమేనా

సొసైటీలో సభ్యుల సంఖ్య కుదించే చర్యలు సాధ్యమేనా అన్నది సందేహంగా మారింది. సొసైటీ ద్వారా సభ్యులకు నోటీసులు జారీ అయ్యాక వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆ సభ్యులను ఎవరు చేర్చుకున్నారు, ఏ ప్రయోజనాల కోసం చేర్చారు అన్నది తేలుతుంది.

#### నోటీసు ఇచ్చాం

సొసైటీలో సభ్యుల సంఖ్యను నిబంధనల మేరకే ఉంచాలని, మిగిలిన సభ్యులను తొలగించాలని కోరుతూ సొసైటీ ఛైర్మన్‌కు నోటీసు పంపామని మదనపల్లె డీఎల్‌సీఓ శ్యాం ప్రకాష్ రెడ్డి తెలిపారు.

### రాయచోటి టీడీపీ అభ్యర్థిని వెంటనే అరెస్ట్ చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్. యానాదయ్య

కడప కార్పొరేషన్ : కులం పేరుతో దూషించిన రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని ఏపీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగియగానే తమకు మద్దతు తెలపలేదన్న కారణంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై, ఏజెంట్లపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. రాయచోటిలో నాయీ బ్రాహ్మణుడైన వెంకటేశ్వర్లు ఇంటిపై 72 మంది దాడి చేసి కారును, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. వాచ్‌మెన్‌ను కూడా కొట్టారన్నారు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పోలింగ్ బూత్‌లోనే వెంకటేశ్వర్లును నానా బూతులు తిట్టాడని, ఆయన ఆధ్వర్యంలోనే వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ టీడీపీకి తొత్తుగా మారిందని, గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని ఇలాంటి దాడులను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మల్లికార్జున, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఆర్‌వీ రమణ, కేవీ రమణ పాల్గొన్నారు.

## వేసవి తాపం తీర్చే తాటిముంజలు


గుర్రంకొండలో తాటిగెలల నుంచి తాటి ముంజలను తీసి ఇస్తున్న మహిళలు (ఇన్‌సెట్) అమ్మకానికి సిద్ధంగా ఉంచి తాజా తాటి ముంజలు

గుర్రంకొండ : తాటిముంజలు వేసవి సీజన్‌లో మాత్రమే లభించే మధుర ఫలాలు. కొందరు రైతులు గత కొన్ని రోజులుగా తాటి ముంజలను గుర్రంకొండకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. పలువురు తాటిచెట్ల నుంచి దించిన గెలలను అలాగే తీసుకొచ్చి తాజాగా అప్పటికప్పుడు మన ముందరే కాయలు కొట్టి ముంజలు తీసి ఇస్తున్నారు. ఈ సీజన్‌లో అన్ని పండ్లకంటే తాటిముంజలకు భలే డిమాండ్ ఉంటుంది. ఒక డజను తాటి ముంజలు రూ. 120 వరకు విక్రయిస్తున్నారు. అంటే ఒక తాటిముంజ రూ. 10 వరకు ధర పలుకుతోంది. ప్రతి వంద గ్రాముల తాటి ముంజల్లో 43 కేలరీల శక్తి, 87.6 గ్రాముల నీటితో పాటు విటమిన్లు, ఐరన్, జింక్, పొటాషియం, కాల్షియం, పాస్పరస్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని, వేసవి తాపాన్ని తీర్చడంలో బాగా పని చేస్తాయి. మనిషికి ఈ వేసవిలో కొబ్బరినీటితో పాటు తాటి ముంజలు అదే స్థాయిలో సేద తీరుస్తుండడం విశేషం. దీంతో ప్రస్తుత వేసవి కాలంలో తాటిముంజలకు భలే డిమాండ్ ఏర్పడింది.

### చేపల వేటకు వెళ్లి చేనేత కార్మికుడి మృతి


మృతి చెందిన కె.ఈశ్వరరెడ్డి

మదనపల్లె : చేపల వేటకు వెళ్లి చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. అనపగుట్టకు చెందిన కోటిరెడ్డి కుమారుడు కె.ఈశ్వరరెడ్డి(57) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజనానంతరం చేపల వేటకు వెళుతున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వచ్చాడు. పట్టణానికి సమీపంలోని తట్టివారిపల్లె చెరువులో చేపల వేటకు దిగాడు. నీళ్లల్లో బురద అధికంగా ఉండటంతో దిగబడ్డాడు. పైగా మద్యం మత్తులో ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక మునిగిపోయాడు. చేపల వేటకు వెళ్లిన ఈశ్వరరెడ్డి ఎంతసేపటికీ రాకపోవడంతో అల్లుడు రామాంజులు వెతుక్కుంటూ తట్టివారిపల్లె చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ ఈశ్వరరెడ్డి మునిగిపోయిన విషయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.